క్లుప్తంగా

నేడు, రేపు తాగునీటి సరఫరాలో అంతరాయం

సూర్యాపేట : పట్టణానికి తాగునీటిని అందించే మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్ మరమ్మతుల కారణంగా గురు, శుక్రవారం రెండు రోజుల పాటు పట్టణంలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పల్లేటి లక్ష్మణ్



నియామక పత్రం అందజేస్తున్న పాపయ్య

సూర్యాపేట : ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్‌గా పల్లేటి లక్ష్మణ్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ బుధవారం హైదరాబాద్‌లో జరిగిన సంఘం రాష్ట్ర సదస్సులో లక్ష్మణ్‌కు నియామక పత్రం అందజేశారు.

కరపత్రాల విడుదల

అర్వపల్లి : హైదరాబాద్‌లో ఈనెల 17న జరిగే రెండో ఏఎన్ఎంల రాష్ట్ర ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం అర్వపల్లిలోని పీహెచ్‌సీలో మహాసభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నగేష్, సూపర్‌వైజర్ లలిత, రెండో ఏఎన్ఎంలు విజయశాంతి, శకుంతల, నాగరాణి, ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డు పరిశీలిస్తున్న జిల్లా వెల్ఫేర్ అధికారి నర్సింగరావు

తిరుమలగిరి : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా వెల్ఫేర్ అధికారి నర్సింగరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఆయన వెంట సూపర్‌వైజర్ కందుకూరి మంగమ్మ, అంగన్‌వాడీ టీచర్ మంజుల ఉన్నారు.

గుణాత్మక విద్య అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రవి

పెన్‌పహాడ్ : తెలుగు భాషపై విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందించాలని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అనంతారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పెన్‌పహాడ్, సూర్యాపేట మండలాల తెలుగు ఉపాధ్యాయులకు నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో తెలుగు సబ్జెక్టుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం మల్లారెడ్డి, ఆర్పీలు గోవర్ధనాచారి, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలను సిద్ధం చేసుకోవాలి

అర్వపల్లి : హరితహారం కార్యక్రమంలో భాగంగా వేసవిలో మొక్కలు పెంచడానికి గ్రామాల్లో ఉపాధిహామీ సిబ్బంది వననర్సరీలను సిద్ధం చేసుకోవాలని ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని కోడూరు, కొమ్మాల, కాసర్లపహాడ్ గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. ఆయన వెంట ఉపాధిహామీ ఈసీ నగేష్, కార్యదర్శులు నారాయణమూర్తి, నెహ్రూనాయక్, ఫర్హాన, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు నిద్ర సుజాత, కె.శైలజ, వన సేవకులు తదితరులు ఉన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

తిరుమలగిరి : ఆదిలాబాద్ జిల్లాలో టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 10, 11తేదీల్లో జరిగే రాష్ట్ర విద్యా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామర శ్రీనివాస్ కోరారు. పట్టణంలో బుధవారం రాష్ట్ర విద్యా మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి అరవింద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కస్తూరి కిషన్‌ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో దివ్యాంగులకు ప్రాధాన్యం కల్పించాలి

ఆత్మకూర్(ఎస్) : ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వేలో దివ్యాంగులకు ప్రాధాన్యం కల్పించాలని వీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ జహీర్‌బాబా బుధవారం డిమాండ్ చేశారు. సర్వే ఫారంలోని 13వ ప్రశ్నలో దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం సదరన్ 21రకాల వైకల్యాలను కోడ్‌ల ఆధారంగా తప్పులు లేకుండా గుర్తించాలన్నారు. సర్వే పత్రాలలో వైకల్యం శాతం ఉంటే బాగుండేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. సర్వే అనంతరం స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు



తిరుమలగిరి : కొత్తచెరువు తండాలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు



చివ్వెంల : ఇంటింటి సర్వేలో పాల్గొన్న మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్‌రెడ్డి

తిరుమలగిరి : సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు కోరారు. బుధవారం మండలంలోని కొత్తచెరువు తండాలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి నర్సింగరావు, తహసీల్దార్ హరిప్రసాద్, ఎంపీడీఓ లాజర్, ఏపీఎం మధుసూదన్, పంచాయతీ అధికారి భీమ్‌సింగ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలి

చివ్వెంల : సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలని మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని గుంపుల గ్రామంలో నిర్వహిస్తున్న ఇంటింటి సమగ్ర సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజలు ఇంటి వద్ద ఉండి వచ్చిన అధికారులకు సామాజిక, కుల, ఆర్థిక, విద్య, ఉపాధికి సంబంధించిన వివరాలు తెలియజేయాలని సూచించారు. సర్వే ఆధారంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ క్రిష్ణయ్య, ఎంపీడీఓ సంతోష్‌కుమార్, ఆర్ఐ శ్రీను, పంచాయతీ కార్యదర్శి వీరబాబు పాల్గొన్నారు.

ఇళ్ల జాబితాను సిద్ధం చేసుకోవాలి

అర్వపల్లి : సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి ఎన్యుమరేటర్లు ఇళ్ల జాబితాను సిద్ధం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి కోరారు. బుధవారం మండలంలోని రామన్నగూడెం, అర్వపల్లి తదితర గ్రామాల్లో కుటుంబ సర్వే కోసం జరుగుతున్న ఇళ్ల జాబితాను పరిశీలించారు. ఇంటింటికి స్టిక్కర్లు వేసి జాబితాను సిద్ధం చేసి ఈనెల 9నుంచి సర్వే ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఎన్యుమరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతనకల్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి బాలు అన్నారు. బుధవారం మండలంలో నిర్వహించిన కుటుంబ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్వేలో ఎలాంటి తప్పిదాలు లేకుండా పూర్తి సమాచారాన్ని సేకరించాలని ఎన్యూమరేటర్లను కోరారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునీత, ఏపీఓ శ్రీరాములు, వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజలు పూర్తి సమాచారం అందించాలి

పెన్‌పహాడ్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు, అధికారులకు పూర్తి సమాచారాన్ని అందించి ప్రజలు సహకరించాలని మండల ప్రత్యేక అధికారి ప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అనంతారం గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఏఎస్ఓ రాధ, ఏపీఓ రవి, ఏపీఎం అజయ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

సైబర్ మోసాల నియంత్రణపై అవగాహన



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సైబర్ సెక్యూరిటీ సెల్ సిబ్బంది, సీనియర్ సిటిజన్స్

సూర్యాపేటటౌన్ : సైబర్ మోసాలను అరికట్టడంలో సైబర్ సెక్యూరిటీ సెల్ సమర్థంగా పనిచేస్తుందని సైబర్ సెక్యూరిటీ సెల్ డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. సైబర్ మోసాలను నివారించడంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్‌లో సీనియర్ సిటిజన్స్‌కు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నగదు బదిలీలు, బ్యాంకింగ్ వ్యవహారాల కోసం ప్రతిఒక్క వినియోగదారుడు ఇంటర్‌నెట్‌పై ఆధారపడుతున్నారని, ప్రతిరోజు చాలా లావాదేవీలను వ్యక్తిగతంగా మొబైల్ ఫోన్ల ద్వారా వినియోగదారులు నిర్వహిస్తున్నారని, ఈ క్రమంలో చాలా రకాలుగా సైబర్ మోసాలకు గురవుతూ ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. ఎవరైనా సైబర్ మోసాల బారిన పడినట్లు గుర్తిస్తే వెంటనే 1930 టోల్ ఫ్రీనంబర్‌కు ఫిర్యాదు చేస్తే అకౌంట్ ఫ్రీజ్ చేసి మీ డబ్బు ఇప్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రాజశేఖర్, ఎస్ఐ గోపికృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

పెన్‌పహాడ్ : మండలంలోని నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మండాది రమేష్ మాతృమూర్తి మండాది మల్లమ్మ, లింగాల గ్రామానికి చెందిన గార్లపాటి అరవింద్‌రెడ్డి, కొండమర్తి సత్యనారాయణచారి ఇటీవల మృతి చెందారు. బుధవారం మృతుల కుటుంబాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పరామర్శించి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా నాగులపాటి అన్నారంలో మల్లమ్మ కుటుంబాన్ని టీపీసీసీ కార్యదర్శి తూముల భుజంగరావు పరామర్శించారు. వారి వెంట మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దొంగరి యుగేంధర్, పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, వెన్న సీతారాంరెడ్డి, మారిపెద్ది శ్రీనివాస్, తూముల ఇంద్రసేనారావు, జూలకంటి వెంకట్‌రెడ్డి, యగ్గడి మురళీ, బాషా, చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, మామిడి వెంకన్న, నాగేశ్వర్‌రావు, రణపంగ సైదులు, రామినేని కృష్ణయ్య, ధనియాకుల సత్యనారాయణ, మీసాల లింగయ్య, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి



చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ అశోక్, ఉపాధ్యాయులు

నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి తెలుగు, ఆంగ్ల భాషా, గణిత సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వాసం ప్రభాకర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయయులు, డీఆర్పీలు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు పోరాడుదాం



ఆత్మకూర్ (ఎస్) : నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూర్(ఎస్) : ప్రతిఘటన పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల ఆశయాల సాధనకు పోరాడుదామని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్ అన్నారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ నవంబర్ 1నుంచి 9వరకు అన్ని గ్రామాలలో ఊరేగింపులు, బహిరంగ సభలు, గ్రూప్ సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు అలుగుబెల్లి వెంకటరెడ్డి, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నర్సమ్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు అలుగుబెల్లి వాణి, పీవైఎల్ మండల నాయకులు పోతురాజు ప్రతాప్, కల్లంచర్ల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలి

నాగారం : అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ అన్నారు. అమరవీరుల వారోత్సవాల సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని యానాల వీరారెడ్డి స్మారకస్థూపం వద్ద జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్, బయ్యం లింగయ్య, దొంతలు ధనుంజయ్, దిగోజు వీరాచారి, పల్లెర్ల సోమన్న, కడారి సైదులు, కాత కొమరయ్య, రింగు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కులగణన చేపట్టడం హర్షణీయం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టడం హర్షణీయమని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ వూర రామ్మూర్తియాదవ్, పెద్దిరెడ్డి రాజా అన్నారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం బీసీ డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రామ్మూర్తి యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో పూలే విగ్రహం వద్ద రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీ చొరవతో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 52శాతం ఉన్న బీసీ వర్గాలు స్థానిక సంస్థల ఎన్నికల్లో రాణించేలా కులగణన నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముదిరెడ్డి రమణారెడ్డి, కౌన్సిలర్లు షఫీ ఉల్లా, వెలుగు వెంకన్న, ఎడ్ల వీరమల్లు గంగాభవానీ, శ్రీవిద్య, జ్యోతి, కరుణాకర్, నాయకులు నిమ్మల వెంకన్న, తండు శ్రీనివాస్‌గౌడ్, వల్దాస్ దేవేందర్, రమేష్‌నాయుడు, మధు, ఫారూఖ్, బంటు చొక్కయ్యగౌడ్, యాట ఉపేందర్, ధర్మా, కరుణాకర్‌రెడ్డి, సూరయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెవిటి వెంకన్నయాదవ్‌కు ఘన సన్మానం



తుంగతుర్తి : వెంకన్నకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎరువుల దుకాణాల డీలర్లు

తుంగతుర్తి : రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌ను బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఫెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చెవిటి వెంకన్నయాదవ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన రైతు సంక్షేమ కమిషన్ దేశానికే ఆదర్శంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో తుంగతుర్తి ఇన్‌చార్జ్ వ్యవసాయ సహాయ సంచాలకుడు బాలకృష్ణ, తిరుమలగిరి, అర్వపల్లి, నాగారం, నూతనకల్, మద్దిరాలు మండలాల ఏఓలు, ఫెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్ తుంగతుర్తి డివిజన్ కమిటీ అధ్యక్షుడు పూసపెల్లి యాదగిరి, సోమ వెంకన్న, ఈశ్వరయ్య, కోశాధికారి నాగిరెడి తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండలంలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బొబ్బిలి వెంకన్న ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్, పాక అమృతమల్లు, చింతల వెంకటేశ్వర్లు, కన్న మల్లయ్య, మూరారి భాస్కర్, గణేష్, ప్రసాద్, బొబ్బిలి రవి, సాయి, అంశయ్య, భాగ్యరాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బాలలు దేశ ప్రగతిలో భాగం కావాలి



విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న దాత కృష్ణకుమార్

పెన్‌పహాడ్ : గ్రామీణ బాలలు రేపటి దేశప్రగతిలో భాగం కావాలని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, సమాజ సేవకుడు, రచయిత పెండెం కృష్ణకుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలకు దేశ నాయకుల, శాస్త్రవేత్తల చిత్రపటాలు, మెడికల్ కిట్లు, వాటర్ క్యాన్, ఆట వస్తువులు, వరల్డ్ మ్యాప్స్, గోడ గడియారం, క్లాత్ బ్యాగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం బొల్లెద్దు నరేందర్ మాట్లాడారు. దాత పెండెం కృష్ణకుమార్ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందించడానికి క్రీడా సామగ్రిని, దేశభక్తిని పెంపొందించడానికి దేశ నాయకుల చిత్ర పటాలను శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి శాస్త్రవేత్తల చిత్రపటాలను, పర్యావరణ పరిరక్షణ అలవర్చడానికి క్లాత్ బ్యాగులను విద్యార్థులకు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నల్లా శ్రీనివాసులు, సరిత, ప్రమీల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



తుంగతుర్తి : రామన్నగూడెంలో ఐకేపీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు



పెన్‌పహాడ్ : నిర్వాహకులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి ప్రసాద్

నాగారం : ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మిల్లులను అలాట్ చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే కాంటాలు వేసి, ట్యాబ్‌లలో నమోదు చేయాలని సూచించారు. రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యాన్ని మిల్లర్లు వెంటనే దిగుమతి చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ మారయ్య, ఎంపీఎస్ఓ రమేష్, రైతులు తదితరులు ఉన్నారు.

ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

తుంగతుర్తి : రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ఈ విషయంపై రైతులు ఎలాంటి భయాందోళనకు గురికావద్దని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని రామన్నగూడెం ఐకేపీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో కుల గణన సామాజిక ఆర్థిక సర్వేపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దయానంద్, ఎంపీడీఓ శేషుకుమార్, ఏపీఎం రాంబాబు, ఏఈఓలు, రైతులు, ఐకేపీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి ప్రసాద్ నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో ఐకేపీ ద్వారా నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కేంద్రంలో సదుపాయాలు కల్పించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ లాలు, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఏపీఎం అజయ్‌నాయక్, ఏపీఓ రవి, వీఓఏ గీత, నిర్వాహకులు చంద్రకళ, లలితా పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : ఐకేపీ కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండ వెంకట్‌రెడ్డి కోరారు. బుధవారం మండల పరిధిలోని నెమ్మికల్లులో కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై 20రోజులు అవుతున్నా నేటికీ ధాన్యం కొనుగోలు వేగవంతం చేయకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండ శ్రీనివాస్‌రెడ్డి, సోమిరెడ్డి దామోదర్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు యాతాకుల మల్లయ్య, బెల్లంకొండ చక్రయ్య, విజయ్‌రెడ్డి, గంపల ఎల్లయ్య, సైదులు, మల్లమ్మ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

నూతనకల్ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని సోమ్లా తండాలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించి వివిధ గ్రామాల్లోని కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీత, ఏపీఎం కమలాకర్‌రావు, వెలుగు సీసీలు ముత్తయ్య, సరస్వతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిని కలిసిన ప్రకృతి ప్రేమికుడు



ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డితో మాట్లాడుతున్న ప్రకృతి ప్రేమికుడు కౌశిక్‌దాస్

సూర్యాపేట టౌన్ : ప్రకృతి ప్రేమికుడికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ప్రోత్సాహకం అందించారు. పర్యావరణ పరిరక్షణ కోసం అక్టోబర్ 20న బెంగాల్ రాష్ట్రంలోని కల్యాణి నుంచి కౌశిక్ దాస్ అనే యువకుడు చేపట్టిన సైకిల్ యాత్ర బుధవారం రాత్రి పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిని తన క్యాంపు కార్యాలయంలో కౌశిక్‌దాసు మర్యాదపూర్వకంగా కలిసి సూర్యాపేట సుందరీకరణ, పచ్చదనం బాగుందని అభివర్ణించారు. దేశమంతా 8నెలల పాటు సైకిల్‌పై తిరిగి పర్యావరణపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి సైకిల్ యాత్ర వివరాలు తెలుసుకుని కాసేపు ముచ్చటించారు. అనంతరం కౌశిక్ దాస్‌కు భోజనంతో పాటు వసతి కలిపించి యాత్ర ఖర్చులకు ఆర్థిక సాయమందించారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసంలో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు

నూతనకల్ : మండలంలోని మిర్యాల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పద్మ మాట్లాడుతూ.. ప్రభుత్వం చిన్నారులు, బాలింతలు, గర్భిణుల సంక్షేమం కోసం పౌష్టికాహారం అందిస్తుందని, ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మెంచు ఉపేంద్ర, కె.స్వాతి, సతీష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది

నూతనకల్ : సమాజంలో అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని తుంగతుర్తి సీఐ శ్రీనివాస్ నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో శ్రీ ధర్మశాస్త్ర అన్నదాన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులకు నిత్యఅన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతనకల్, మద్దిరాల మండలాల పరిధిలోని మాలధారణ స్వాములకు అన్నదాన కార్యక్రమం చేపట్టడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా నిత్య అన్నదానం చేపట్టిన ట్రస్టు వ్యవస్థాపకుడు దాచేపల్లి శ్రీనివాస్‌ను అభినందించారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, శ్రీశంభులింగేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ దేవిరెడ్డి నర్సిరెడ్డి రూ.25వేల నగదును అన్నదాన సేవా ట్రస్టుకు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ మహేంద్రనాథ్, ఆలయ కమిటీ చైర్మన్ చురుకంటి చంద్రారెడ్డి, ఎంపీడీఓ సునీత, అన్నదాన సేవా ట్రస్టు మండల కమిటీ అధ్యక్షుడు కాముని సత్యనారాయణ, చూడి మధుసూదన్‌రెడ్డి, పగిళ్ల వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులపై ఫిర్యాదు

నాగారం : మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో రైతు ఆకుల నాగయ్యకు చెందిన ఎద్దు మంగళవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఈ ఘటనపై రైతు నాగయ్య విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే తన ఎద్దు మృత్యువాత పడిందని బుధవారం మండల పోలీస్‌స్టేషన్‌లో విద్యుత్ అధికారులపై ఫిర్యాదు చేశాడు. అనంతరం ఎద్దు మృతిపై పోలీసులు పంచనామా చేసి, మండల పశువైద్యాధికారి డాక్టర్ బత్తుల రవితో పోస్టుమార్టం నిర్వహించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

తిరుమలగిరి : మండలంలోని జలాల్‌పురం గ్రామానికి చెందిన నారి మల్లయ్యకు చెందిన గేదె విద్యుదాఘాతంతో బుధవారం మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. పొలంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండడంతో మేతకు వెళ్లిన గేదె ప్రమాదవశాత్తు తీగలకు తగిలి మృతి చెందిందని, గేదె విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని వాపోయాడు.

బోరు మోటార్ ఏర్పాటు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో నీటి సమస్యను పరిష్కరించేందుకు ఇటీవల రేఖ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బోరును వేయించారు. ఈ బోరుకు బుధవారం రూ.35వేల ఖర్చుతో మోటార్‌ను అమర్చారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో ట్యాంకును కూడా నిర్మించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ తెలిపారు.

'కేజీబీవీ'కి ప్రహరీ కరువు

- పాఠశాల ఆవరణలో సంచరిస్తున్న మూగజీవాలు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థినులు



మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాల

పెన్‌పహాడ్ : పేద కుటుంబాలకు చెందిన బాలికలతో పాటు మధ్యలో చదువు మానేసిన బాలికలకు విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను ఏర్పాటు చేసింది. ఈ పాఠశాలల్లో వారికి మెరుగైన విద్యతో పాటు విద్యార్థులకు ఉచిత భోజన వసతి, దుస్తులు అందజేస్తూ చదువుల్లో రాణించేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ఇంత వరకు బాగానే ఉన్నా పాఠశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బంది పడాల్సివస్తుంది. విద్యార్థులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలను అధికారులు కల్పించకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. మండల కేంద్రంలోని కేజీబీవీపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ పాఠశాల భవనాన్ని నిర్మించి రెండు సంవత్సరాలు గడుస్తున్నా చుట్టూ ప్రహరీ నిర్మాణం చేయడం మరిచారు.

విద్యార్థులకు రక్షణ కరువు..

మండలంలోని కస్తూరిబా పాఠశాలలో సుమారు 280మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల చుట్టూ అధికారులు ప్రహరీ నిర్మించకపోవడంతో రాత్రి సమయాల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రహరీ లేక మూగజీవాలు సంచరిస్తున్నాయి. అదే విధంగా రాత్రి సమయంలో విద్యార్థులు ఆవరణలోకి వెళ్లాలంటే జంకుతున్నారు. అదే విధంగా విద్యాలయం ఎదుట ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. విద్యార్థులకు శారీరక ఉల్లాసం కోసం క్రీడలు తప్పనిసరి కానీ విద్యార్థులు ఆటస్థలం ఉన్న క్రీడలు ఆడలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కేజీబీవీ చుట్టూ ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.

అధికారులకు విన్నవించాం

కేజీబీవీ వసతిగృహానికి ఎదుట ప్రహరీ నిర్మాణం చేట్టాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పలు మార్లు అధికారులకు విన్నవించాం. ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీ నిర్మిస్తే విద్యార్థుల ఇబ్బందులు తొలగనున్నాయి.

– ఆసీయా జబీన్, కేజీబీవీ, ప్రత్యేక అధికారి